# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 19 జూన్ 2026


## ఆర్డీఓ ఏవోగా నరసింహారాజు బాధ్యతల స్వీకరణ



**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త:**

పీలేరు రెవెన్యూ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నరసింహారాజు బాధ్యతలు తీసుకున్నారు గురువారం ఆయన స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల అధికారులతో రెవెన్యూ సిబ్బందితో సమన్వయము చేసుకొని ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు రెవెన్యూ వ్యవస్థలో ఎటువంటి ఫిర్యాదుదారునికి సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**కలికిరి, జూన్ 18, ప్రభాతవార్త:**

కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై గురువారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మరియు భారతీయ వ్యవసాయ పరిధోధన మండలి ఆదేశాల మేరకు గురువారం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ వ్యవసాయంపై చర్చా సమావేశం జరిగింది. రైతులు నాణ్యమైన పంటల దిగుబడి కోసం సేంద్రియ పద్ధతులు, వరి, వేరుశనగ, మామిడి తోటల్లో అన్నమయ్య జిల్లాలో పాటించాల్సిన ఆవశ్యకత గురించి, పంటలు వేసే మందులు, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంఇ పైర్లు పెంచి నేలలో కలియ దున్నడం పశువుల ఎరువు జీవనం, ఎరువులు విరివిగా వాడి వేపనూనె లాంటి కీటక నాశనాలు, ట్రైకోడెర్మా సూడోమోనాస్ వాడకం ద్వారా పురుగులు మంరియు నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారణ చేయవచ్చని కేవీకే అధిపతి డా.కె.మంజుల తెలిపారు. ఏపీ కమ్యూనిటటీ మేనేజడ్ నాచురల్ ఫార్మింగ్ కలికిరి అధికారి రాధా, ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసులు, ..మిగతా 2వ పేజీలో

# జలధారతో జిల్లాకు జల విజయం

### రెండేళ్ళ పాలనలో ఎంతో అభివృద్ధి.. రాష్ట మంత్రులు మండిపల్లి, జనార్ధన్‌రెడ్డిలు



స్టాల్స్ ను పరిశీలిస్తున్న మంత్రులు, మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :**

జలధారతో జిల్లాకు జల విజయం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాల, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో రెండేళ్ళ నమ్మకం-సుపరిపాలన-అభివృద్ధి సంక్షేమం పై జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రులు హాజరయ్యారు.

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనతో రాష్ట్రం అభివృద్ధి**

**రాష్ట్ర రవాణా, యువజన-క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన - క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రజలు కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలను ఉత్సాహంగా జరుపుకోవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్లిన పెట్టుబడిదారులు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని, రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణం మరింత బలపడిందన్నారు. అమరావతి అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో రాష్ట్రం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర నాయకత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నా యని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి మాట్లా డుతూ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అమలవుతు న్న ఈ కార్యక్రమం నీటిసంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్భజలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు కొత్త ఊపు ఇచ్చిందన్నారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్తాయిలోప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే స్తాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండేళ్ళ కూటమి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈసందర్బంగా అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రులు, జిల్లా కలెక్టర్లు పరిశీలించి అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## జూన్ 20న రాయచోటిలో రెండేళ్ల సంక్షేమ విజయోత్సవ సభకు అందరూ తరలిరండి

### మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి జూన్ 18 ప్రభాతవార్త**

జూన్ 20న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మసాపేట సాయి శుభ కళ్యాణ మండపంలో రెండేళ్ల సంక్షేమ విజయోత్సవ సభకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు తరలి రావాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రెండేళ్ల సంక్షేమ విజయోత్సవ సభ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ నున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలపై సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, రానున్న కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రెండేళ్ల సంక్షేమ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

## మంత్రి సవితతో జగన్ రాజు భేటీ



కడప ఇంచార్జ్ మంత్రి సవితతో జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 18. ప్రభాతవార్త**

కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవితతో రాజంపేట అసెంబ్లీ చమర్తి జగన్మోహన్ రాజు భేటీ అయ్యారు. గురువారం రాష్ట్రంలో కుటుంబ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తి అయిన సందర్భంగా కడపలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రితో జగన్మోహన్ రాజు కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జగన్ రాజు తో పాటు మంత్రిని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, ఒంటిమిట్ట జెడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏపీఎల్ లో బోణీ కొట్టిన రాయలసీమ రాయల్స్

ఏపీఎల్ లో బోణీ కొట్టిన
తేజ తుఫాన్ ఇన్నింగ్స్ తో
అభిషేక్ సెంచరీకి వృధా
మిడిలార్డర్ మెరుపులతో కాకినాడ కింగ్స్‌పై
ఘన విజయం



సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన జీఎస్పీ తేజ,అభిషేక్ రెడ్డి సెంచరీ వృధా





ఎమ్మెల్యే చైతన్య రెడ్డి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న తేజ

**పులివెందుల, జూన్ 18, ప్రభాతవార్త:**

ఏపీఎల్2026 సీజన్5లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. కడపలోని వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై ఉత్కంఠభరిత పోరులో రాయలసీమ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన కాకినాడ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే దూకుడుగా ఆడిన కాకినాడ బ్యాటర్లు పవర్‌ప్లేలో మంచి స్కోరు సాధించారు. 10 ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి అద్భుత సెంచరీ సాధించాడు. 60 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 112 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. చివర్లో లేకాజ్ రెడ్డి 17 బంతుల్లో 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో కాకినాడ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రాయలసీమ బౌలర్లలో పార్థసారథి, పురుషోత్తం గణేష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్స్ ఆఫ్ రాయలసీమకు ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు త్వరగా వెనుదిరిగినా మిడిలార్డర్ బ్యాటర్లు జట్టును విజయతీరాలకు చేర్చారు. జీఎస్పీ తేజ 43 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 76 పరుగులు చేసి చివరి వరకు పోరాడాడు. అతనికి తోడు వై. వాసు 14 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 42 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చాడు. వై. తేజారెడ్డి 27 బంతుల్లో 41 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ముగ్గురి మెరుపు బ్యాటింగ్‌తో రాయలసీమ జట్టు 18.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయాన్ని అందించిన జీఎస్పీ తేజకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ..మిగతా 2వ పేజీలో

## ప్రజా సేవలోనే తలమునకలై పనిచేస్తున్నాం

### తహసిల్దార్ శివకుమార్



**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త:**

పీలేరు రెవెన్యూ మండల పరిధిలో ప్రతి గ్రామంలో స్వయంగా అర్జీదారులతో మాట్లాడటమే కాకుండా వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని పీలేరు తహసిల్దార్ శివకుమార్ అన్నారు. గురు వారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఉద యం కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటమే కాకుండా గ్రామాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం, రిసర్వే కార్యక్రమం పిజిఆర్ఎస్ అర్జీలను స్వయంగా పరిశీలించి గ్రామాలలో ఉన్న సమస్య లను పరిష్కరించేందుకు ప్రతిరోజు గ్రామాలలో పర్యటిస్తున్నామని సిబ్బందితో సమన్వయం చేసుకొని ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు సర్వేయర్,లు మండల సర్వేయరులు కలిసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిరోజు ఒక గ్రామాన్ని వెం పిక చేసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు. కార్యాల యంలో ఉన్న సిబ్బంది విద్యార్థులకు రైతులకు కావలసిన సమాచారాన్ని మండల డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతిరోజు కార్యాలయంలోని అర్జీదారు లతో మాట్లాడటమే కాకుండా వారి వద్ద ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోయినవి తసిల్దారుగా నేను సాయంత్రం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని ఆయన అన్నారు .అదేవిధంగా గ్రామాలలో రైతుల సమస్యలను తమ సమస్యగా భావించి పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నట్లు కార్యాలయంలో ఎక్కువ సమయం గడప లేకపోవటమే కాకుండా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో జరిగే ప్రతి కార్యక్రమానికి మండలం నుంచి తహసిల్దారుగా హాజరవుతున్నామని అదేవిధం గా ఆర్డీవో కార్యాలయంలో జరిగే కార్యక్రమాలలో కూడా విధిగా పాల్గొనడంతో కార్యాలయంలో ఎక్కువ సమయం ఉండకపోవటం కొంతమంది కార్యాలయానికి రాలేదని అంటున్నారని సమాచారాన్ని అందితే ఏ క్షణమైన సమస్యను పరిష్క రించేందుకు ముందు ఉంటానని తహసిల్దార్ శివకుమార్ అన్నారు.

## టీడీపీ విజయోత్సవ సభ ఘనంగా నిర్వహణ



**బద్వేల్ అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త**

టీడీపీ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కడపలో "మన నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" పేరుతో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో, కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. సభలో బద్వేల్ టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బీరం జయరామిరెడ్డి, బద్వేల్ నీటి సంఘం వైస్ చైర్మన్ సిద్ధమూర్తి చెన్నారెడ్డి, సీనియర్ నాయకుడు బుడిగిరెడ్డి నాగసుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు వివరించారు. జిల్లాలో చేపట్టిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, కల్పించిన ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర పురోగతికి దోహదపడుతున్నాయని నాయకులు పేర్కొన్నారు.

## చేనేత కార్మికుడు ఆత్మహత్య



**మదనపల్లెక్రైం, జూన్ 18 ప్రభాతవార్త.**

చేనేత కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లిలో జరిగింది. మదనపల్లె తాలూకా పోలీసుల కథనం మేరకు వివరాలు తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకల చెరువు మండలం, దేవలచెరువు పంచాయతీ, శివరాంపల్లి కి చెందిన జింకా రాధాకృష్ణ కుమారుడు జింకా సోమశేఖర్ (45) కొన్నేళ్ల క్రితం మదనపల్లె పట్టణం, నీరుగట్టుపల్లెలోని బాబూకాలనీ కి వచ్చి స్థిరపడ్డాడు. స్థానికంగా కూలి మగ్గాలు నేస్తూ భార్య స్వర్ణలత తో పాటు తన కుమార్తెను పోషించుకుంటున్నాడు. ఇదిలా ఉంటే సోమశేఖర్‌కు అనారోగ్యం తో బాధపడుతు జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి భార్య స్వర్ణలత చీరను తీసుకుని వెళ్లి కాలనీకి సమీపంలోని కాట్లాటపల్లి రోడ్డు లోని ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే తాలూకా ఎస్ఐ చంద్ర మోహన్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సోమశేఖర్ మరణ వార్త తెలియగానే కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇంటి యజమాని మృతితో తమ కుటుంబం వీధిన పడ్డట్లయిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

## కూటమి రెండేళ్ల పాలనలో హామీలన్నీ అమలు చేశాం

### పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి

**పులివెందుల, జూన్ 18 ప్రభాత వార్త :**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కడప నగరంలోని పుత్త ఎస్టేట్‌లో నిర్వహించిన విజయోత్సవ బహిరంగ సభలో కడప జిల్లా నాయకుడు బీటెక్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను ముందుకు తీసుకెళ్తోం దని తెలిపారు. గత ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికే అమ్మ ఒడి పథకం వర్తించేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాలకు వెళ్లే ప్రతి బిడ్డకు ప్రయోజనం అందుతోందని అన్నారు. వేంపల్లెలో ఒక తల్లికి ఐదుగురు పిల్లలు ఉన్నప్పటికీ అందరికీ ఈ పథకం వర్తింపజేశామని పేర్కొన్నారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, ఈ పథకాన్ని అన్ని వర్గాల మహి ళలు వినియోగించు కుంటు న్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రతి ప్రాంతంలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని బీటెక్ రవి వెల్లడించారు. పీ4 మోడల్, రాజ్యసభ సభ్యుల నిధులు, పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల ద్వారా వీటికి నిధులు సమకూర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల ప్రాంతంలో గాలివానలకు అరటి తోటలు దెబ్బతిన్న సమయంలో రైతులు ఫిర్యాదు చేయక ముందే జిల్లా యంత్రాంగం స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నారని కలెక్టర్ పనితీరును ఆయన ప్రశంసించారు. జిల్లాలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని, ప్రతిపక్ష పార్టీల వారిని ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు లేవని అన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎస్పీ సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తు న్నారని పేర్కొన్నారు. బీసీ హాస్టల్ అభివృద్ధికి రూ.9 కోట్లు ఖర్చు చేసి సౌకర్యాలు మెరుగుపరిచామని, ప్రస్తుతం 600 మంది విద్యార్థులు అక్కడ ఉండి చదువుకునే అవకాశం కలిగిందని తెలిపారు. రాబోయే 30-35 రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు నిర్వహించ నున్నామని, ఈ పర్యటనల్లో ప్రజలు ప్రస్తావించే బోర్లు, డ్రైనేజీ వంటి అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు లేదా డీఎంఎఫ్ నిధుల నుంచి నిధులు కేటాయించాలని మంత్రి, కలెక్టర్‌లను కోరినట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతను ఇన్‌ఛార్జ్ మంత్రి తీసుకోవాలని కోరగా, అభివృద్ధికి సంబంధించిన హామీలను నెరవేర్చుతామని మంత్రి హామీ ఇచ్చారని బీటెక్ రవి తెలిపారు. పెన్షన్ల పంపిణీ విషయంలో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిం చేందుకు లోకేష్ సూచనలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత జగన్‌పై విమర్శలు చేస్తూ వ్యక్తిగత ఆరోపణలు చేశారు. ప్రజలకు, రాష్ట్ర అభివృద్ధికి తగిన విధంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సభలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత

డాక్టర్ రెడ్డెప్ప,డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ



**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త;**
నియోజకవర్గంలోనే గుర్రంకొండ లో ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని తరిగొండ వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా స్థానిక సచివాలయం లో తల్లులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్న దని, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం నీళ్లవిరోచనాలతో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా చూడటం మరియు మరణాలు జరగకుండా నియంత్రణ చేయడం అని తెలిపారు. నీళ్ల విరోచనాలు ఒక వైరస్ వల్ల వస్తాయి. రోజుకు 4లేదా 5సార్లు పలుచటి నీళ్ల మాదిరి బేధులు ఐతే వాటిని డయేరియా అంటారు. కావున వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపయోగించడం, చేతుల శుభ్రత పాటించడం, ఈనెల 28న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కావున అపుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్. ఎన్. మద్దమ్మ, పర్యవేక్షకులు సుజాత, ఏ.ఎన్.ఎమ్. నాగజ్యోతి, ఆశ కార్యకర్తలు రెడ్డెమ్మ, చిన్న పాప తల్లులు వారి సహాయకులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవులు



**పీలేరు, జూన్18, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కెవి పల్లి మండలం, గ్యారంపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో సంస్కృతం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జంతుశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నవి. తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులను జూన్ 26వ తేదీ లోపు గ్యారంపల్లి జూనియర్ కళాశాల ఆఫీస్ నందు సమర్పించాలి. సంబంధిత సబ్జెక్టు నందు మాస్టర్ డిగ్రీ కలిగి ఉండవలయును. నెలసరి జీతం రూ.18,000 ఉంటుంది. అనుభవం, బోధనా నైపుణ్యతను బట్టి అధ్యాప కులను ఎంపిక చేయబడునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు ఒక ప్రకటనలో కోరారు.

## మొండివారిపల్లి రహదారి సమస్య పరిష్కరించండి



**తంబళ్లపల్లె, జూన్ 18, ప్రభాతవార్త**
మండలంలోని పరసతోపు పంచాయతీ మొండివారిపల్లిలో పూర్వం నుండి నిరుపేద మైనార్టీ, బిసి కుటుంబాలు ఉండి రహదారి ఆ సమస్య ఉండేది. కొన్నాళ్ల క్రితం రెవిన్యూ అధికారులు గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేశారు. రహదారి గత వర్షాలకు గుంతల మయమైంది. ఈ రహదారిని కొందరు అగ్రవర్ణాల వారు ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే మీ దిక్కున చోటు చెప్పుకోండి అని చెప్పడంతో నిస్సహాయులైన ఆ మైనార్టీ కుటుంబాలు విధిలేక తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉషారాణికి మైనారిటీ పురుషులు, మహిళలు మూకుమ్మడిగా తమ గోడు ఫిర్యాదుల రూపంలో వెళ్లబోసుకున్నారు. రోడ్డు సౌకర్యం లేక రాకపోకలు, కనీస అవసరాలతో పాటు అంబులెన్స్ రావడానికి వీలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని అధికారులు స్పందించాలని మొరపెట్టుకున్నారు. తాసిల్దార్ శ్రీనివాసులు రహదారి సమస్య పరిష్కరిస్తారని హామీ ఇవ్వగా ఎంపీడీవో ఉషారాణి రహదారి సమస్య పరిష్కారమైతే రోడ్డు నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి ఆ నిరుపేద మైనార్టీ కుటుంబాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మొదటి పేజీ తరువాయి

కేవీకే సూపరింటెండెంట్ వీవీ శ్రీలక్ష్మీ రుక్మిణులు రైతులకు సూచనలు, సలహాలు చేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డా.పీరూసాహెబ్ కంది ఉత్పత్తుల, వేరుశనగ తదితర వాటి గురించి రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయ రైతులకు సీవీ నారాయణరెడ్డి, సుధాకర్ ఇతర అభ్యుదయ రైతులు వరిలో సేంద్రియ వ్యవసాయం మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా లాభం పొందుతున్నామని వారి అనుభవం తెలిపారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయానికి కావాల్సిన ఉత్పత్తులైన వవానపాముల ఎరువు, కషాయాలు, జిగుర అట్టలు, వేపనూనె, పండు ఈగ బుట్టలు, కేవీకేలో సాగు చేసిన సేంద్రియ పంట ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులు రైతుల కోసం ప్రదర్శనలో పెట్టారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి హాజరై సంతృప్తి వ్యక్తం చేశారు.

## ముతవల్లి జలీల్ అహ్మద్ ఖాజీ అక్రమాలపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

**కలికిరి, జూన్ 18, ప్రభాతవార్త:**
పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలంలోని ముతవల్లి జమీం అహ్మద్ అవకతవకలపై గుర్రంకొండ మరియు కండ్రిక మసీదు కమిటీ ప్రజలు బుధవారం సాయంత్రం నగిరిపల్లిలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముతవల్లి మసీదులకు సంబంధించి భూములు జామియా మసీదు గుర్రంకొండ గ్రామానికి సంబంధించిన మెయిన్ రోడ్డు లో గల భూములు తన బంధువుల ద్వారా విక్రయించి కోట్లు సంపాదించారన్నారు. అలాగే పటాన్‌లకు దొంగ (బీసీఈ) షేక్ దృశ పత్రాలు ఇచ్చారన్నారు. మసీదు కమిటీని నియమించకుండా సింగల్ అకౌంట్ వాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జలీల్ అహ్మద్‌కు గుర్రంకొండ ఖాజీ పోస్టు మరియు ముతవల్లి పోస్టు నుంచి తొలగించి అర్హత ఉన్న వారికి ఇవ్వాలని కోరారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

కడప జిల్లా జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్



**గాలివీడు. జూన్ 18, ప్రభాత వార్త :**
సమాజంలో చట్టాలు పరిరక్షణకు, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి (జిల్లా జడ్జి) ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో గాలివీడు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నందు ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, లక్కిరెడ్డిపల్లి సివిల్ జూనియర్ జడ్జి భరత్ కమల్ గుప్తా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తు లు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో యువత,బాలలు ఎదుర్కొంటున్న సవాళ్లు, చట్టపరమైన రక్షణల గురించి సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల నిరోధక చట్టం (పోక్సో), బాల్య వివాహాల దురాచారం, చట్టపరమైన శిక్షలు, సమాజాన్ని పీడిస్తున్న డ్రగ్స్/మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు మరియు వివిధ రకాల నేరాల పట్ల విద్యార్థులను, ప్రజలను అప్రమత్తం చేశారు. "చట్టాన్ని తెలుసుకోవడం హక్కు మాత్రమే కాదు… బాధ్యత కూడా. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టపరిధిని గౌరవిస్తూ న్యాయమైన మార్గంలో నడవాలి." నేర రహిత సమాజ స్థాపనకు పిలుపు: పిల్లలకు చిన్న తనం నుంచే మంచి, చెడులతో పాటు చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంద న్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, ఎలాంటి సమస్య వచ్చినా చట్టపరమైన సహాయం ఎలా పొందాలో వివరించారు. ఈ అవగాహన సదస్సులో న్యాయవాదులు చెన్న క్రిష్ణ, కిరణ్ కుమార్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం సిబ్బంది చంద్ర కాంతమ్మ,శనిత, మనోహర్ జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజం అందరి బాధ్యత

## ఎంపీడీవో శంకరయ్య

**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త:**
ప్రతి బిడ్డకు పోలియో రహిత భవిష్యత్తు మన బాధ్యత అని పీలేరు మండల అభివృద్ధి అధికారి శంకరయ్య అన్నారు. పీలేరు మండల అభివృద్ధి కార్యక్రమంలో పల్స్ పోలియోకార్యక్రమంలో భాగంగా అంతర్ శాఖల సమన్వయ సమావేశములో శంకరయ్య పాల్గొని అమూల్య సూచన సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు సోకే పోలియో వ్యాధి, నాడీ వ్యవస్థ దెబ్బతిని అంగవైకల్యం వస్తుందని,నివారనే లేని ఈ వ్యాధి రాకుండా ఉండుటకు రెండు పోలియో చుక్కలే మార్గమని, కావున జూన్ 28వ తేదీ ఆదివారం నిర్వహించబోయే అప్పుడే పుట్టిన బిడ్డ 05 సంవత్సరాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేయు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హితవు పలికారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాశాఖ తరుపున పూర్తి సహాయ సహకారాలు ఈ కార్యక్రమంలో ఉంటామని తెలిపారు. తలుపుల ,రేగల్లు ప్రదానవైద్యాధికారులు డా: శ్రీ గిరిష డా: రాధా మాధవి గారు సంయుక్తంగా ప్రకటిస్తూ పీలేరు మండలంలో గుర్తించిన 05 సం: పిల్లలు మొత్తం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరయ్య

19,775, అని 44 పోలియో బూతులలో ,పిల్లలకు చుక్కలు వేయడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు, వివిధ యన్‌జిఒ సంస్థల అధికారులు,వివిధ స్థాయి సిబ్బంది కార్యక్రమం జయప్రదంచేయాలని, కోరారు.కార్యక్రమంలో పి.హెచ్.యన్ కుసుమ, మండలంలోని అందరూ క్షేత్ర స్థాయి ఆరోగ్యశాఖ పర్యవేక్షణ అధికారులు, ఐసిడియస్ పర్యవేక్షణ అధికారులు, ఏ యన్ యం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ పనితీరు బాగుంది

తాసిల్దార్ శ్రీనివాసులు



**తంబళ్లపల్లె జూన్ 18 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె నియోజకవర్గ 2047 విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది పనితీరు బాగుందని తాసిల్దార్ శ్రీనివాసులు కొనియాడారు. గురువారం ఆయన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ను సందర్శించి సిబ్బందితో పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం లోని 6 మండలాల లోని సంబంధిత శాఖల సమస్యలను గుర్తించి పరిష్కారానికి సమస్యలని వేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. మండలాలలోని ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఈ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ వారధిగా నిలుస్తుందని తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ యూనిట్ ద్వారా సమస్యలు పరిష్కారం కావడం హర్షనీయమని తాసిల్దార్ విలేకరులకు తెలిపారు. ఆయన వెంట వీఆర్వో నాగరాజు, యాక్షన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 28న మదనపల్లెకు వైఎస్.జగన్ రాక

కలెక్టర్, ఎస్‌పిలను కలిసిన నేతలు



**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న మదనపల్లెకు రానున్నారు. ఈ మేరకు గురువారం వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, వైకాపా నేతలతో కలసి అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్‌పి ధీరజ్ కనుబిల్లిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి మదనపల్లె పర్యటనకు సంబంధించి జిల్లా అధికారులను అనుమతులు కోరడం జరిగిందన్నారు. మాజీ సిఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు మదనపల్లెకు విచ్చేసి హెలిప్యాడ్, రూట్‌మ్యాప్, ఏర్పాట్లను పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నిస్సార్ అహ్మద్‌తో పాటు సీనియర్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, వలసపల్లె నాగరాజరెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, ఈశ్వర్‌నాయక్, ఇర్ఫాన్‌ఖాన్, మల్లికార్జునరెడ్డి, భయ్యారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్‌లు పాల్గొన్నారు.

## ప్రతి డంపింగ్ యార్డ్ ఓ బృందావనం కావాలి

ఎంపీడీవో ఉషారాణి



**తంబళ్లపల్లె జూన్ 18 ప్రభాతవార్త :**
మండలంలోని ప్రతి డంపింగ్ యార్డ్ ఓ బృందావనంలా తయారు కావడానికి కార్యదర్శులు పనిచేసేలా డిప్యూటీ ఎంపీడీవోలు చొరవ చూపాలని ఈ బాధ్యత మీరే తీసుకోవాలని ఎంపీడీవో ఉషారాణి సూచించారు. గురువారం తంబళ్లపల్లె డంపింగ్ యార్డ్ సమస్యపై స్పందించి తంబళ్లపల్లె డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించి సేకరించిన తడి,పొడిచెత్తను వేరుచేసి ఎరువు తయారు చేసి ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో ఎంవి ప్రసాద్ ను ఆదేశించారు. మండలంలో ప్రతి డంపింగ్ యార్డ్ లో మొక్కుబడిగా చెత్త సేకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యదర్శులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమాలన్నీ తనదాకా రాకుండా పూర్తి చేయాల్సిన బాధ్యత మీదేనని డిప్యూటీలకు సూచించారు.

## చైతన్య సంస్థలో వృద్ధులకు అన్నదానం



**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :**
పట్టణ సమీపంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సంస్థలో గురువారం విద్యార్థులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర డైరెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలు, వృద్ధులు, అనాధ విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజికి బాధ్యత అన్నారు. మానవతా దృక్పదంతో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. విద్యార్థులకు పో షకాహారం అందించడం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు తోడ్పాటు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ కవితారాణి, అంజాద్‌బాషా, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ



**పెద్దమండెం జూన్ 18 ప్రభాతవార్త**
ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తుంది ఈ నేపథ్యంలో గురువారం రైతులకు స్థానిక రైతు భరోసా కేంద్రంలో విత్తనాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి సురేష్ తెలిపారు ప్రతి రైతుకు ఒక్కొక్క మూట 1850 రూపాయలతో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు గత సంవత్సరం రాయితీ విత్తనాలు తీసుకొని రైతులు పంటలు పెట్టకుండా వాటిని జీవనానికి వాడుకున్నారని అన్నారు దీంతో ప్రభుత్వం ఈసారి విత్తనాల పంపిణీ కేవలం శ్రీ గొల్లపల్లి పెద్దమండెం పంచాయతీలకు 300 మూటలు మాత్రమే పంపించిందన్నారు అవసరమైతే రైతులు పంటలకు వినియోగిస్తేనే విత్తనాలను మరికొన్ని బస్తాలను అందిస్తామని తెలియజేశారు. రైతులు విత్తనాలను పంటలకు వినియోగించుకుని లబ్ధి పొందాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఈఓ భవ్య శ్రీ పాల్గొన్నారు.

## అర్బన్ సీఐ వెంకటేశ్వర్లను సత్కరించిన పాలకుంట శ్రీనివాసులు



**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త:**
పీలేరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి. వెంకటేశ్వర్లు గారిని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బీసీ హక్కుల పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ఎద్దుల మహేష్ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాలకుంట శ్రీనివాసులు బహుజన వర్గాల ప్రజలు వారి సమస్యలను తమరి దృష్టికి తెస్తే ఆలస్యం లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసి అట్రాసిటీ నివారణ కొరకు కృషి చేయాలని సిఐని కోరడంతో అందుకు సీఐ వెంకటేశ్వర్లు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు బహుజన వర్గాల ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేసి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపినట్లు పాలకుంట శ్రీనివాసులు తెలియజేశారు.

## ప్రజాసేవ మా ధ్యేయం ఫ్రెండ్లీ పోలీస్

ప్రజా సమస్యలుపరిష్కార దిశగా ఉండటం మా బాధ్యత
నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**పీలేరు. జూన్ 18, ప్రభాతవార్త:**
పోలీస్ వ్యవస్థ అంటేనే 24 గంటలు ప్రజాసేవలో ప్రజలకు రక్షణ కల్పించడమే కాకుండా ఫ్రెండ్లీ పోలీస్ గా వ్యవహరిస్తూ అనునిత్యం ప్రజలకు రక్షణగా ఉంటామని వారికున్న సమస్యలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిరోజు పోలీసింగ్ నిర్వహిసున్నామని అదే విధంగా ప్రధాన కూడలైన క్రాస్ రోడ్డు, బోడంపల్లి క్రాస్, ఆర్ డి ఓ ఆఫీస్ తో పాటు గతంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ,షీ టీం ఏర్పాటు చేస్తున్నామని ఉదయం సాయంత్రం విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులు భద్రత కల్పిస్తున్నానని ,అదే విధంగా మరింత ముందుకు వెళ్లేందుకు ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంచి పేకాట జూదం రౌడీయిజం లేకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు.

## ములకలచెరువు ఎంపీడీవోగా అమరనాథ్ రెడ్డి



**ములకలచెరువు, జూన్ 19, ప్రభాతవార్త**
ములకలచెరువు ఎంపీడీవోగా అమర్నాథ్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న ఎంపీడీవో హరి నారాయణ పదోన్నతి రావడంతో బదిలీపై కడపకు వెళ్లారు. చంద్రగిరి ఎంపీడీవో గా పని చేస్తున్న అమర్నాథ్ రెడ్డి బదిలీపై ములకలచెరువుకు వచ్చారు. ఈ సందర్భంగా అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

## చిన్నారి పరామర్శపై విమర్శలు సరికాదు

పేర్ని నాని వ్యాఖ్యలకు జనసేన నేతల ఘాటు కౌంటర్

**పులివెందుల, జూన్ 18 , ప్రభాత వార్త :**
అనారోగ్యంతో బాధపడు తున్న చిన్నారి కోరిక మేరకు వెళ్లి పరామర్శించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేయడం దుర్మార్గమైన రాజకీయాలకు నిదర్శనమని పులివెందుల పట్టణ జనసేన నాయకులు హితేష్ రాయల్, బాబావలి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక చిన్నారి మనోధైర్యాన్ని పెంచేందుకు చేసిన ప్రయత్నాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం మానవత్వ రాహిత్యాన్ని చూపిస్తోందని విమర్శించారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకోలేని వారు, ప్రజల కోసం నిలబడే నాయకులపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మానవత్వానికి రాజకీయ రంగు పులమడం సరైంది కాదని, ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల ఫలితాల్లో ప్రజా తీర్పు ఎంత శక్తివంతమో ఇప్పటికే నిరూపితమైందని అన్నారు. "150 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అహంకార ధోరణి రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారు" అని వారు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

# రాయలసీమ రాయల్స్

మొదటి పేజీ తరువాయి

.పోరాడుతున్న క్యాపిటల్ అమరావతి రాయల్స్..
వైయస్సార్ క్రికెట్ స్టేడియం నందు జరుగుతున్న రెండవ మ్యాచ్ లో పోరాడుతున్న క్యాపిటల్ అమరావతి రాయల్స్ పోరాడుతోంది. కడపటి వార్తలు అందేసరికి 7.3 ఓవర్లలో 70/3 రన్స్ చేసింది. క్యాపిటల్ అమరావతి రాయల్స్ విజయానికి 75 అంతుల్లో 133 రన్ సాధించాలి . అంతకు మునుపు సింహాద్రి వైజాగ్ లయన్స్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లు లో5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. హనీష్ వీరారెడ్డి 34 బంతుల్లో 62 పరుగులు 8 ఫోర్లు 2 సిక్సర్లు ,మహిప్ కుమార్ 41 బంతుల్లో 62 పరుగులు 7 ఫోర్లు1 సిక్సర్, చివర్లో ధనుష్ 14 బంతుల్లో 36 పరుగులు మూడు పోర్లు మూడు సిక్సర్లు సాధించగా అమరావతి బౌలర్లలో టోషిత్ యాదవ్ 2 శశికాంత్, వర్మ తల వికెట్ పడగొట్టారు. క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు యుఎమ్ఎస్ గిరినాథ్ 10 బంతుల్లో 15 పరుగులతోనూ కరమ్ షిండే 0 మీద ఆడుతూ గెలుపు కోసం పోరాడుతున్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి:ఆపస్ డిమాండ్




**మదనపల్లెక్రైం, జూన్ 18 ప్రభాతవార్త.**
2010 టెట్ నోటిఫికేషన్‌కు ముందు నియామకం పొందిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నియమం నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటులో ప్రత్యేక చట్ట సవరణ చేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నిబంధనల నుండి మినహాయించాలని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సొరకాయల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ తప్పనిసరి అనడం సమంజసం కాదన్నారు. నిరసన అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు పరశురాం, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు నాయక్, జిల్లా సహాధ్యక్షులు జి.పి. నాగేంద్రబాబు, పచ్చర్ల సుధాకర్, జిల్లా కార్యదర్శి శేఖర్ రెడ్డి, వెంకటరమణ, హేమలత, ఉపాధ్యాయులు రాజా, రేపన ఆంజనేయులు, నాగేంద్రప్రసాద్, నారాయణ నాయక్, నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సింగిల్ విండో అధ్యక్షులు లారీ వెంకటరామరారెడ్డిని పరామర్శించిన హరీష్ రెడ్డి

**పీలేరు జూన్ 18 ప్రభాతవార్త:**
గురువారం పీలేరు మండలం దొడ్డిపల్లి గ్రామం రెడ్డివారిపల్లి నందు పీలేరు మండలం వైకాపా మాజీ కన్వీనర్ మరియు పీలేరు సింగల్ విండో మాజీ అధ్యక్షులు శ్రీ నారే వెంకట్రమణ రెడ్డి గారి తండ్రి శ్రీ నారే శ్రీనివాసులురెడ్డి గారు ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన మన రాష్ట్ర ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ గౌ"శ్రీ హరీష్ రెడ్డి గారు మరియు పీలేరు మండలం ఎంపీపీ సతీష్ రెడ్డి శ్యామ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



## ఏపీ మోడల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన ఎస్టియు

**రామసముద్రం జూన్ 18 ప్రభాతవార్త**
మండలం లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈరోజు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మండల ఎస్ టి యు శాఖ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల లో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు గోపీనాథ్ 27 వేల రూపాయలు నగదు బహుమతులు పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హేమలత మాట్లాడుతూ ఎస్టీయు నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్ మాట్లాడుతూ సంఘ కార్యక్రమాలతోపాటు సామాజిక కార్యక్రమాలను, పేద పిల్లల చేయుత కు రామసముద్రం మండలంలో ఎస్టీయూ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినట్లు చెప్పారు. మండలంలో పనిచేసి రిటైర్డ్ అయిన గోపీనాథ్ సేవలు మరవలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా పరిషత్ చెంబకూరు ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ కుమార్ కు మొదటి బహుమతిగా 5116/ రూపాయలు నగదు అందజేశారు. అలాగే రెండో బహుమతిగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి వైష్ణవికు రూ. 3116, అరికల ఉన్నత పాఠశాల విద్యార్థి అమృత వర్షిని కు మూడవ బహుమతి కింద 2116ల నగదు అందజేయడం జరిగింది. వీటితోపాటు మండలంలోని చెంబకూరు,మట్లవారిపల్లి, రామసముద్రం, కేజీబీవీ ,ఏపీ




మోడల్ స్కూల్, కెసిపల్లి, అరికల ఉన్నత పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన మరో 14 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 1116/ రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్ చెంబకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు కేజీబీవీ ఎస్ ఓ మస్తాన్ బి ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి రామసముద్రం అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ప్రధాన కార్యదర్శి రమాదేవి ఆర్థిక కార్యదర్శి సురేష్ రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బారెడ్డి ఎస్.టి యు అన్నమయ్య జిల్లా, మండల నాయకులు మనోహర , అనిల్ కుమార్, తిరుమలరెడ్డిపల్లె నరసింహులు, మహీధర్ రావు, మహీధర్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, నరసింహులు , బాలాజీ, శ్రీనివాసులు, గురు ప్రసాద్, చలపతి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గాజులు నగరం తిరుపతి గంగమ్మ కు విశేష పూజలు



**రామసముద్రం జూన్ 18ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని గాజుల నగరం వద్ద కొలువైన తిరుపతి గంగమ్మ కు గురు వారం విశేష పూజలు జరిగాయి, ఉదయాన్నే ఆలయ పూజారి అనిల్ కుమార్ శర్మ అమ్మ వారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం అమ్మ వారికి పలు రకాల పుష్పాలు, వేపాకు, నిమ్మకాయలు హారాలు నూతన వస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరణ చేసి అమ్మ వారికి మంగళ హారతులు సమర్పించారు, ఉదయం నుండి అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మ వారిని దర్శనం చేసుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు, అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ పూజారి అనిల్ కుమార్ శాస్త్రి తీర్థ ప్రసాధాలు అందజేశారు.

## పాత్రికేయుని ఇంట్లో వికసించిన విద్యాకుసుమం



**కలికిరి, జూన్ 18, ప్రభాతవార్త:**
ఇంటర్ సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఆర్.తేజశ్విని సీఈసీ విభాగం ఇంప్రూమెంట్ పరీక్షల్లో వెయ్యి మార్కులకు గాను 962 మార్కులు సాధించి కలికిరి మండల టాపర్‌గా నిలిచింది. విద్యార్థి తండ్రి రగిరెడ్డిపల్లి నాగరాజ పత్రికా విలేకరి కాగా తల్లి లక్ష్మీదేవి గృహిణి. పేద కుటుంబంలో పుట్టిన తేజశ్విని చదువులో గొప్పగా రాణిస్తూ తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెడుతోంది. విద్యార్థి ప్రతిభకు అధ్యాపకులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

ENDOWMENTS DEPARTMENT
SRI KANAPARTHY ANJANEYA SWAMY TEMPLE
Kanaparthi(V), Chennuru(M), Kadapa District
e-Procurement Tender
NIT.NO.P/COE/902/2026-19, Dt:01.05.2026
e-Tenders are invited through the e-Procurement portal for Re-Construction of Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
- TRUSTEE

# టిడిపి చేస్తున్న అవినీతి ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధం

## మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 18 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇ ల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం చేసే క్రమం లో తనపై టిడిపి చేస్తున్న అవినీతి ఆరోపణలపై ఎ లాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని తక్షణమే విచారణ చేపట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రా చమల్లు శివప్రసాద్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశా రు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ బుధవారం జరిగిన జిల్లా రివిజన్ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతిపై విచారణ అర్పించాలన్న వ్యాఖ్యలను ఆయన స్వాగతించారు. గత వైసిపి పాలనలో ఇళ్లు లేని పేదలందరికీ గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో సుమారు 23 వేల మందికి పూర్తి హక్కులతో ఇంటి పట్టాలు పంపిణీ చేశామని, ఇళ్ల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారునికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఆ సమయం లో గృహనిర్మాణ పనుల కోసం నిల్వ చేసిన సుమా రు 268 టన్నుల ఇనుప కడ్డీలు, దాదాపు 20 లా రీల సరుకు, రూ.1.70 కోట్ల విలువైన సామగ్రి మాయమైనట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి హౌసింగ్ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఏఈ సుబ్రహ్మణ్యా న్ని అరెస్టు చేశారని గుర్తుచేశారు. సుబ్రహ్మణ్యం గ త ప్రభుత్వంలో రూరల్ ఏఈగా పనిచేశారని, కూ టమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ యనకు ఇన్‌ఛార్జ్ డీఈ బాధ్యతలు కల్పించారని ఆ రోపించారు. ఆయన సంబంధిత శాఖ కార్యాలయం కంటే ఎక్కువగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యాలయంలోనే ఉండేవారని, ప్రభుత్వ ఆస్తి మాయం ఘటనలో అనేక అనుమానాలు అధికార పార్టీ వైపు చూపుతున్నాయని వ్యాఖ్యానించారు. సు బ్రహ్మణ్యం అరెస్టు అనంతరం ఆయన నోరు విప్ప కపోవడానికి అధికార పార్టీ అండదండలే కారణమని ఆరోపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహ రించి కస్టడీలో విచారణ నిర్వహిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేయడం కంటే ముందుగా మా యమైన ఇనుప కడ్డీలను రికవరీ చేయాలని డిమాం డ్ చేశారు. ఈ కేసులో హమాలీలు, మేస్త్రీలు, సం బంధిత సిబ్బంది, ఘటన జరిగిన రోజున అక్కడికి వచ్చిన అధికారులుగానీ, ప్రైవేటు వ్యక్తులుగానీ ఎ వరెవరు ఉన్నారో విచారణ చేస్తే అసలు నిందితు లను గుర్తించవచ్చని తెలిపారు. పోలీసులు కేసును ఛేదించే సామర్థ్యం ఉన్నప్పటికీ, పూర్తి స్థాయిలో ని జాలను బహిర్గతం చేస్తారో లేదో అన్న అనుమానం ప్రజల్లో ఉందన్నారు. ప్రధానంగా లబ్ధిదారులు, గుర్తింపు పొందిన 11 మంది కాంట్రాక్టర్లు, గుర్తింపు లేని సుమారు 20 మంది కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులను విచారిస్తే ఫలితం ఉంటుందని పేర్కొ న్నారు. ప్రతి లబ్ధిదారుడు చెల్లించిన రూ.35 వేల



మేర పనులు జరిగాయా, అంతకంటే ఎక్కువ పని జరిగితే బిల్లులు మంజూరయ్యాయా, కాంట్రాక్టర్లకు మొత్తం చెల్లింపులు చేరాయా, అధికారులు ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా అనే అంశాలపై దర్యాప్తు జరగాలని కోరారు. కొందరు కాంట్రాక్టర్లు నిర్మాణ సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించిన విషయాల ను కూడా తాను చూపించగలనని పేర్కొన్నారు. జగనన్న కాలనీలు, ఎస్ఎస్ మాల్, డీఎడబ్ల్యూ కళాశాల వ్యవహారాలు సహా ప్రతి అంశాన్ని తనకు ఆపాదించడం సరికాదన్నారు. నిజంగా అక్రమాలు జరిగాయని భావిస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోలీసు, విజిలెన్స్, సిట్, సీఐడీ లేదా సీ బీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తా ను ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నానని, నిజాయితీ ఉన్నందువల్లే ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని స్పష్టం చేశారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జ్ జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి చేస్తున్న విమర్శలు సహితుకం కాదని ఆయన కొట్టిపారేశారు.

# మలేరియా నిర్మూలనపై అవగాహన



సిద్ధవటం జూన్ 18 ప్రభాతవార్త

మండలంలోని లింగంపల్లి గ్రామంలో పి కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రంగలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మలేరియా నిర్మూలలపై అ వగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ వెం కటసుబ్బయ్య మాట్లాడుతూ మలేరియా నిర్మూలలపై దోమలు ఉత్పత్తి చెంద కుండా కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు పాత టైర్లు, పూల మొక్కల కుం డీలలో నీరు నిలువ లేకుండా చూడాలని నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు సోకే ప్రమాదం ఉందని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూ పర్వైజర్ శారదా దేవి, జి వెంకటసుబ్బయ్య ఆరోగ్య కార్యకర్తలు, ఉమామహే శ్వరి, అరుణ పాల్గొన్నారు.

# పల్స్ పోలియోపై ఒక రోజు శిక్షణ



సుండుపల్లె, జూన్ 18, ప్రభాతవార్త :

సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో జాతీయ పల్స్ పోలియో చు క్కల కార్యక్రమం సందర్భంగా 2026 జూన్ 28 వ తేదీ ఆదివారము మం డలంలో 36 పోలియో కేంద్రాలలో జరగ బోవు కార్యక్రమం లో భాగంగా పోలియో చుక్కల కేంద్రాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం డాక్టర్ ఫర్హా ఖానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయవ లెననే విషయము గురించి తెలియజేసినారు. ఈ శిక్షణ కార్యక్రమం లో డాక్టర్.దిలీప్,సి హెచ్ ఓ రామకృష్ణ యాదవ్, ఎం పి హెచ్ ఈ ఓ.శివారెడ్డి,పి హెచ్ న్ నూర్జహాన్, సూపర్వైజర్లు సదాశివారెడ్డి, అలివేలమ్మ ,సుగుణ హెల్త్ అసిస్టెంట్ రామయ్య ,ఏ ఎన్ మ్ లు,ఎమ్ ఎల్ హెచ్ పి లు, మరియు అం గన్వాడీ కార్యకర్తలు,మరియు ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్ లేకుండా బస్సులు నడిపితే సీజ్ చేస్తాం

పులివెందుల, జూన్ 18 , ప్రభాత వార్త :

ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకుండా బస్సులను నడిపే యజమానులపై చర్యలు తీసుకుంటామని పులివెందుల ఎంవీఐ బీవీ ప్రసాద్ హెచ్చ రించారు. గురు వారం ఆయన మాట్లాడుతూ వాహనాల భద్రత, ప్రయాణికుల రక్షణ దృష్ట్యా ప్రతి బస్సుకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను కడప ఏటీఎస్ కు అప్ప గించడంతో ప్రస్తుతం పులివెందుల ఆర్టీవో కార్యాలయంలో ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని తెలిపారు. బస్సు యజమానులు నిబంధన లను పా టిస్తూ సంబంధిత కేంద్రాల్లో ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. ఇటీవల పది రోజుల క్రితం పులివెందుల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాల లను సందర్శించి స్కూల్ బస్సులకు తప్పనిసరిగా ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఉండే లా చర్యలు తీసుకో వాలని యజమా న్యాలకు నోటీసులు అందించినట్లు ఎం వీఐ తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ఫి ట్నెస్ లేకుండా రోడ్లపై తిరిగే బస్సులను గుర్తించి సీజ్ చేయడంతో పాటు ని బంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంవీఐ ప్రసాద్ స్పష్టం చేశారు.

# కూలీల అక్రమ రవాణా ముఠా అరెస్ట్

నందలూరు, జూన్ 18 ప్రభాతవార్త :

మండలంలోని కోనాపురం గ్రామ సమీపంలో సోమశిల బ్యాక్‌వాటర్స్ ప్రాం తంలో కూలీలను అక్రమంగా తరలించి నిర్బంధించి వెట్టిచాకిరి చేయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే తె లిపారు. గురువారం నందలూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కేసులో వెలుమలై, నేతాజీ, కోదం డ, జానీ సయ్యద్ ఖాన్, రాము, ఈసాక్, రాజేష్ అనే ఏడుగురు నిందితు లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద సంచరించే అమాయకులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని మాయమాటలు చెప్పి చేపల వేట పనులకు తరలించి జాలర్లకు కమిషన్ ప్రాతిపదికన అప్పగిస్తున్నట్లు విచారణలోవెల్లడైందన్నారు. నిందితుల చెర నుంచి 11 మంది బాధిత కూలీలకు విముక్తి కల్పించినట్లు తెలి పారు. వీరిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు ప్రకా శం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించామని చెప్పా రు. పక్కా సమాచారంతో ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, నందలూరు ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు బృందం దాడులు నిర్వహించి నిందితులను పట్టుకున్నట్లు ఏఎస్పీ వివరించారు. మానవ అక్రమ రవాణా, బలవంతపు శ్రమ వంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



# నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ముద్దనూరు, జూన్ 18 (ప్రభాతవార్త):



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ జాన్సన్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనలో బాధ్యులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్, వైఎస్సార్ కడప జిల్లా శాఖ ప్రతినిధులు ముద్దనూరు పోలీస్ స్టేషన్‌లో గురువా రం సీఐ నగేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసి యేషన్ నాయకులు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు జరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. దాడికి పాల్పడిన వా రిపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన సీఐ నగేష్‌బాబు కేసును సమగ్రంగా విచారించి, నిం దితులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. మనోహర్, జిల్లా కోశాధికారి పుష్పలత, సభ్యులు ఖాదర్ బాషా, కృష్ణ, జీవన్, శివశంకర్, హరి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామం పరిపాలన అధికారిగా శివప్రసాద్ రెడ్డి

కడప కార్పొరేషన్ జూన్ 18 ప్రభాతవార్త:

కడప శిల్పారామం పరిపాలన అధికారిగా పి.శివ ప్రసాద్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం కొత్త కొత్తదనాం ఇచ్చే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. శిల్పారామంకు వచ్చే ప్రేక్షకులకు మరిన్ని సౌకర్యాల కల్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నా మీద నమ్మకముతో ఈ బాధ్యతను అప్పగించిన చైర్ పర్సన్ మంజులారెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామినాయుడులకు కృ తజ్ఞ తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఇ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన "మేధా" విద్యార్థులు

మైదుకూరు, జూన్ 18, ప్రభాతవార్త:

2026 మే నెలలో జరిగిన ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలలో స్థానిక మేధా బాలికల కళాశాల విద్యార్థులు అనూహ్య ప్రతిభను కనపర్చారు. ఎంపిసి విభాగంలో ఎస్. హంసీర 466/470,డి. శివనాగలక్ష్మి 465/470,టి. నాగ జ్యోత్స్న 465/470, బైపిసి విభాగంలో సి. భానుమతి దేవి 449/455,ఎస్. నబీనా 449/455,కె. నవ్య శ్రీ 447/455 మార్కు లతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచినట్లుగా చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు, ప్రిన్సిపాల్ డి. ప్రతాప్ తెలిపారు. ఈ విజయానికి కారకులైన అధ్యాపకులకు మరియు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఆర్ఈఎస్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు,

మైదుకూరు పట్టణ కడప రోడ్డు ఆర్ఈఎస్ విద్యార్థులు 2026 మే నెలలో జరిగిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో స్థానిక ఆర్ఈఎస్ కళాశాల విద్యార్థులు గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని మార్కులతో ప్రభం జనం సృష్టించారు. ఎంపిసి విభాగంలో కె.శివాజీ గణేష్ 467/470 మా ర్కులతో స్టేట్ మూడవ ర్యాంకు సాధించాడు.కె. సుశాంత్ 464/470,వి. రమణ 458/470,మార్కులతో ప్రతిభ కనపర్చినట్లుగా ప్రిన్సిపాల్ పి. రా జారెడ్డి తెలిపారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల అధ్యాపకులు మరి యు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీ వెంకటేశ్వర కళాశాల విద్యార్థుల ప్రభంజనం

మైదుకూరు, జూన్ 18, ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాలలో శ్రీ వెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరం బైపిసి యస్ .సమీనా 455 కి 450 మార్కులు సాధించి మైదుకూరు టౌన్ ఫస్ట్ సాధించారు మొదటి సంవత్సరం ఎంపీసీ కి చెందిన ఎన్ . చంద్రలేఖ 465/470 సాధించారు రెండవ సంవత్సరం సిఈసి గ్రూప్లో డి.ధరణి బిందు 947/1000 మార్కులు ఇవే కాకుండా వివిధ గ్రూపులలో జిల్లా ర్యాంకులు మైదుకూరు నియోజకవర్గ ర్యాంకులు సాధించారు కళాశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లాలోనే కాక రాష్ట్ర స్థాయిలో కూడా తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ విజయంతో కళాశాల ప్రతిష్ట మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.ఉత్తీర్ణులైన విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందిస్తూ, వారి భవిష్యత్తు విద్యా ప్రయాణంలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇంతటి విజయానికి కార ణం అయినా అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి విద్యార్థినిలకు వారి తల్లిదం డ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## టెట్ మినహాయింపునకు

# చట్ట సవరణ చేయాలి: ఆపస్

ఎడ్యుకేషన్ జూన్ 18 ప్రభాతవార్త :

2010 టెట్ నోటిఫికేషన్‌కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నిబంధన నుంచి మినహాయించేలా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రి, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మల్లికార్జునుడికి ఆపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 2010 టెట్ నోటిఫి కేషన్‌కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, పదోన్నతులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిబంధనను 2010 నోటి ఫికేషన్ విడుదలైన తేదీ నుంచి మాత్రమే అమలు చేసేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది.కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా మీడియా ఇన్ చార్జి బాలకృష్ణుడు, మండల నాయకులు గంగన్న, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు ఒక రోజు శిక్షణ




రామసముద్రం జూన్ 18 ప్రభాతవార్త

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఎంపిడివో లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి ఒ క్క రూ పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు కావాలని, ప్రజలకు ఏళ్లప్పుడూ అం దుబాటులో ఉండాలని, గ్రామల్లో పంచాయతీ అభివృద్ధికి కావాల్సి న సదు పాయాలు కల్పించాలని, మురుగు కాలువలు మరమత్తులు, వీధి దీపాలు, త్రాగు నీరు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పి జి ఆర్ ఎస్,యోగాంధ్ర,అక్షర ఆంధ్ర పై అధికారులు ప్రత్యేక ద్రుష్టి పెట్టాలని రాబోయే స్థానిక ఎన్నికలు జరు గుతాయని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పంచా యతీ అభి వృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లు పంచాయతీ అభివృద్ధిపథంలో ఉండాలని వారి ద్యేయం అని అన్నారు,ప్రతి ఒక్క అధికారి గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తీర్చాలని పంచాయతీ అధికారులకు తెలియజేసారు.ఈ స మావేశంలో ఎంపిడివో లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడివో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు కార్యాలయసిబ్బంది హాజరయ్యారు.

# ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్ట్

- రూ.60వేలు నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విభూకృష్ణ



ప్రొద్దుటూరు క్రైం, జూన్ 18, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ పరిధిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ విభూకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించడంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీ అయ్యారని గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. అరెస్టైన ముగ్గురి నింది తులపై 40కి పైగా వివిధ కేసులు నమోదైనట్లు ఏఎస్పీ తెలిపారు. ప్రజలు అక్రమ గ్యాంబ్లింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యక లాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని ఏఎస్పీ విభూకృష్ణ సూచించారు.

# రీజినల్ డైరెక్టర్‌ను కలిసిన ఎన్జీవో నాయకులు



కడప కార్పొరేషన్ జూన్ 18 ప్రభాతవార్త:

ఏపీఎన్జీజీఓ జిల్లా అధ్యక్షులు మరియు జేఏసి ఛైర్మెన్ బలపనూరు శ్రీనివా సులు, రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరిరెడ్డిలు రీజినల్ డైరెక్టర్ ను మర్యాదపూ ర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. సహాయక మలేరియా అధికా రులు, సూపరింటెండెంట్స్ ప్రమోషన్స్, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు హుస్సేన్ రెడ్డి, కడప జిల్లా కోశాధికారి టీ.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి డి. పద్మనాభరావు, డా క్టర్ రామ గిడ్డయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బద్వేల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

బద్వేలు అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త



ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో బద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా నడుస్తున్న గవర్నమెంట్ హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా మొదటి సంవత్సరం ఫలితాల్లో విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు పేరు తె చ్చారు. బైపీసీ విభాగానికి చెందిన కె. స్వప్న 455 మార్కులకు గాను 448 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజులపల్లె వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ, స్వప్న సాధించిన విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపా ధ్యాయులకు గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే ఎంపీసీ విభాగానికి చెందిన కె. వర్ష నందిని 470 మార్కులకు గాను 445 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచినట్లు కాలేజీ ఇన్‌చార్జి ఎద్దు జగరయ్య తెలిపారు. విద్యార్థినుల విజయానికి వారి కృషి, క్రమశిక్షణతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు టీ. వెంకటసుబ్బయ్య, వై. ఓబయ్యతో పాటు ఇతర సిబ్బంది విద్యార్థినులను అభినందించారు. భవిష్య త్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహి స్తామని తెలిపారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాలకు దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఎస్.ఐ.ఆర్ ను పరిశీలించిన తహసీల్దార్

దువ్వూరు, జూన్ 18, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితల సవ రణకు గాను జరుగుతున్న సర్ సర్వేను మండల తహసీల్దార్ సంజీవరెడ్డి పరిశీ లించారు. దువ్వూరు లోని వనం వీధి, కామనూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో బిఎల్వోతో కలిసి ఫారంను ఓటరుకు అందజేసి వాటిని ఎలా పూర్తి చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఈ సర్వే వల్ల ఓటరుకు ఎటువంటి అన్యాయం జరగదని పూర్తిగా ఓటర్ల జా బితా ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్క ఓటరు సహకరించి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అంద జేసి బిఎల్వో లకు సహకరించాలన్నారు. అనంతరం ఎంకుపల్లె గ్రామంలో జ రుగుతున్న రీ సర్వేను కూడా ఆయన పరిశీలించి గ్రామ సర్వేయర్లకు, వీఆ ర్వోలకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



# పంచాయతీ సిబ్బంది స్థానికులతో చర్చించిన డిపిఒ

సుండుపల్లె, జూన్ 18,ప్రభాతవార్త :

సుండుపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిదిలోని అగ్రహారం, యేటిగడ్డరా చపల్లె, చెన్నంశెట్టిపల్లె, పెద్ద బలిజపల్లె గుట్ట కాడా బలిజపల్లె, మల్లక్కగారి పల్లె, సాంసేనిగడ్డ హరిజనవాడ, గిరిజన వాడలు, రవీంద్ర నగర్, యల్లారెడ్డి గారిపల్లె, ఈ గ్రామాలన్నింటిని కలిపి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని జనసేన నేత రామాశ్రీనివాస్ గ్రామప్రజల అభ్యర్తన మేరకు వై ఎస్ ఆర్ కడప పంచాయతీ అధికారి వెంకటసుబ్బయ్య గురువారం సుండుపల్లె కు వచ్చి సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు తో మాట్లాడి ఆ ప్రాంతాలను పరిశీలించి స్థానికుల అభిప్రాయం సేకరించి వెళ్లడం జరిగిందని ఆయన తెలి పాడు. ఈ కార్యక్రమం లో ఏం పి డి ఒ సుధాకర్ రెడ్డి పంచాయతీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో డా. బి.జె.యస్.ఆర్., సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

బద్వేలు అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో బద్వేల్ పట్టణంలోని డా. బి.జె.యస్.ఆర్. మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో బి. జాహ్నవి 989 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలవగా, బైపీసీ విభాగంలో సరితాల అయేషా సుల్తానా 983 మా ర్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. అదేవిధంగా పి. ధన్వి, బి. గుణవర్షిణి (985), ఎన్. సుదీక్షిత్ (982), ఎం. శివనందిని, ఆర్. విజయ్ చంద్ర, కె. చంద్రమోళిక (979), షేక్ యాసీన్ (976), పి. వెంకట కౌశిక్ (972), కె. సాయి సాత్విక (971) మార్కులు సాధించి ప్రతిభ చాటారు. జూనియర్ ఇం టర్ ఎంపీసీ విభాగంలో బిజివేముల జాహ్నవి, బిజివేముల వర్షితలు 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి ముందంజలో నిలిచారు. ఎస్. జాహ్నవి, ఇ. బాలాజీ (462), మన్యం స్వర్ణకళ, సందా సూర్యచరణ్ (461), యాపరాల శ్రీవిద్య (460), నేలటూరి మల్లేశ్వరి, బీరం పుష్పలత (459), ఎ. లక్ష్మీ ప్రణీత, సి.వి. మనీష్ కుమార్ (458) తదితరులు విశేష ప్రతిభ కన బరిచారు. బైపీసీ విభాగంలో ఆర్. వెంకట సురేంద్ర 455 మార్కులకు గాను 442 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. బి. దోసిని, సయ్యద్ జహీదా తబస్సుమ్ (437), పి. లక్ష్మీ పవిత్ర (418), ఎం. ఈశ్రిన్ (407), బి. మానస (404) మంచి ఫలితాలు సాధించారు. సీఈసీ విభాగంలో బీరం సాయి దీప 500 మార్కులకు గాను 470 మార్కులు సాధించి టౌన్ టాప్‌గా నిలవగా, కె. శ్రీహర్షిత (441), ఎస్. సుభాన్ బి (426), వై. శివ మహేశ్వరి (414) ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డా. బి.జె.యస్.ఆర్. జూనియర్ కళాశాల మరియు సుభాష్ గాయత్రి జూని యర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, యాజమాన్యం అభినందించారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.

# చదివిన బడిపై మమకారం



చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త

చదువుకొన్న పాఠశాలకు కొంత మేలు చేకూర్చాలనుకొన్నాడా పూర్వపు వి ద్యార్థి...అనుకొన్న వెంటనే తన తండ్రి ద్వారా పిల్లలకు విద్యావుపయోగకర వస్తువులు...పదిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థిని ఉన్నత చదువులకు సాంకేతికత అడ్డంకి కాకూడదని ల్యాప్‌టాప్ బహూకరించారు...మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లి ప్రాథమిక పాఠశాలలో కుమారస్వామి చది వాడు. ఈక్రమంలో అతని తండ్రి నరసింహులు సహకారంతో బడిపిల్లలకు విద్యావుపయోగకర వస్తువులనందించాడు. అదే విధంగా పదిలో 578మా ర్కులు సాధించిన జ్యోత్స్నకు రూ. 60వేలు విలువ చేయు ల్యాప్‌టాప్‌ను బ హూకరించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని సమాజసేవకు అంకితమైన తండ్రీ, కొడుకులను ఎంఇఓ కేశవరెడ్డి అభినందించారు. ఇదే వి ధంగా విద్యార్థులు రాణించాలని కోరారు. అనంతరం ఇదే పాఠశాలలో గతంలో 23ఏళ్ళు పనిచేసి, ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసిన ఉపాధ్యాయుడు నాగరాజును ఘనంగా సన్మానించారు. ప్రధానో పాధ్యాయుడు శేషాద్రి, మునీశ్వరయ్య, స్థలదాత లక్ష్మీనరసయ్య, చౌడప్ప, ప్రియాంక, ఓబులేసు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఉదయాన్నే విద్యార్థులకు దాత నరసింహులు అల్పాహారాన్ని ఏర్పాటు చేసారు.

# వ్యవసాయకూలీని కాటేసిన విషసర్పం

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త

వ్యవసాయ కూలీని విషసర్పం కాటేయడంతో ఆమె అస్వస్థతకు గురైంది. పుంగనూరు మండలం నెక్కొంది పంచాయతీకి అలసాపురంకు చెందిన సు జాత(28) చౌడేపల్లి మండలం పరికిదొన పంచాయతీ దొనపల్లికి కూలీ పనుల కు వచ్చింది. పొలంలో టమోటాలు కోస్తుండగా విషసర్పం కాటేసింది. అప స్మారక పరిస్థితిలోకి చేరుకొన్న ఆమెను చుట్టుపక్కలున్న కూలీలు స్థానిక ఆ రోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ సుజాత ఆరోగ్య పరిస్థితి విషమిండంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# పంచాయతీల అభివృద్ధిపై శిక్షణా తరగతులు

తంబళ్లపల్లె జూన్ 18 ప్రభాతవార్త ః

మండలం లోని 21 పంచాయతీల కార్యదర్శిలకు (ఆర్ జి ఎస్ ఏ) రాష్ట్రీయ గ్రామ స్వరాజ్యం అభియాన్ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో ఉషారాణి ఆధ్వ ర్యంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పన్నుల వసూళ్ల, ఆదాయ వన రులు గుర్తించి పంచాయతీలలోని గ్రామాలలో తాగునీరు, పారిశుద్ధం, వీధిలై ట్లు, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రణాళిక బద్ధం గా అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాలలో క్షేత్రస్థాయి పర్యటనతో సమస్యలను గుర్తించి పరిష్కారంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు ఎం వి ప్రసాద్, మారుతీకుమార్, ఏవో థామస్ రాజా కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్ ఇంటింటి కార్యక్రమం

కలికిరి, జూన్ 18, ప్రభాతవార్త:

కలికిరి మేజర్ పంచాయతీలో తహసీల్దార్ సయిద్ అహ్మద్ ఆదేశాల మేరకు బీఎల్ఓ శిల్ప, బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఓటరు మ్యాపింగ్ ఇంటింటి కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా కలికిరి మండలం సహకార బ్యాంక్ ఛైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఛైర్మన్ ఓటరుకు సంబంధించి వివరాలు సేకరించి మ్యాపింగ్ చేశారు. కలికిరి మండలంలో పీలేరు నియో జకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తెదేపా బూతు కన్వీనర్ బీఎల్ఏ కె.బావాజీ అధికారుల వెంట వెళ్లి ఓటరు ప్రక్రియ నమో దులో పాల్గొని అధికారులకు సహకరిస్తున్నారు. తెదేపా నాయకులు, కార్యక ర్తలు సైతం తమ ఓటరు ప్రక్రియలో పాల్గొన కొత్తగా ఓటరు నమోదు కార్యక్ర మం చేయిస్తున్నారు. మ్యాపింగ్ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది.

# విద్యార్థిని రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు

కలసపాడు, జూన్ 18 ప్రభాతవార్త:

కలసపాడులోని ఎస్. కె విద్యా సంస్థ పి ఎస్ ఆర్ కళాశాల విద్యార్థిని ద్వేతీయ ఎం పి సి విభాగంలో 1000/991 మార్కులుతో ఏ పి రాష్ట్ర 4వ ర్యాంకు సాధించింది. అలాగే పద్మంజలి 987, డి. కరిష్మా 985. విద్యార్థు లకు విద్యా సంస్థల ఛైర్మన్ అఫ్రోజ్ షైక్, సిఏఓ ఖాద్రి హెచ్. ఎం షైక్, ఏఓ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యాపకులు , సిబ్బంది అభినం దించారు.

## కడపను ఇంధన,

# పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం



**కడప, జూన్ 18 ప్రభాతవార్త :**

రాష్ట్ర అభివృద్ధి,పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. జిల్లాలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాన్ని ముఖ్యంగా కడప జిల్లాను పునరుత్పాదక ఇంధన, పారిశ్రామిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్ లో ఘనంగా ప్రారంభం అయిన "రాష్ట్రంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఎస్. సవితతోపాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ సెల్కే నచికేత్ విశ్వనాథ్ లు హాజరయ్యారు. వారితో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్‌లు, కడప, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు సి. ఆదినారాయణ రెడ్డి, ఆర్.మాధవి రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీన, కడప నగర కమీషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సౌర, వాయు విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కడప జిల్లాలో భారీ స్థాయిలో సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అమలవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణలు అందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే అవకాశాలు సృష్టిస్తున్నామన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో రోడ్లు, రైల్వే కనెక్టివిటీ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 500 కిలోమీటర్లకు పైగా రహదారి అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, వాటి కోసం రూ.18 వేల కోట్లకు పైగా వ్యయం ప్రతిపాదించబడిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కడప నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందన్నారు. పండుగలు,సంప్రదాయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని మంత్రి సవిత అన్నారు. మన పెద్దలు అందించిన విలువలు, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగలు ప్రజల్లో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని, యువత సంస్కృతి పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ కడప జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, చివరికి నిజాయితీ, పారదర్శకత, అభివృద్ధే విజయం సాధిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్లకు చెందిన జిల్లా నాయకులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పలువురు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులుహాజరయ్యారు.

## అడ్మిషన్ పక్రియకు ఏర్పాట్లు పూర్తి

**నేటి నుంచి ఆర్జీయూకేటి యూజీ26 అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం**

**వేంపల్లె జూన్ 18 ప్రభాతవార్త**

ఆర్జీయూకేటి యూజీ26 అడ్మిషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ విజయ్ ప్రకాష్ వెల్లడించారు. నేటి నుంచి ఈ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. ఆర్కేవ్యాలి క్యాంపస్ కీ ఎంపికైన విధ్యార్థులకు, వీరి తల్లిదండ్రులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, కౌన్సిలింగ్ కు హాజరయ్యే విధ్యార్థులు ప్రధాన ముఖద్వారంలో సంతకం చేసి టోకెన్ తీసుకుని క్యాంపస్ లోకి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 గంటలకు ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని డైరెక్టర్ తెలిపారు. అలాగే కౌన్సిలింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు, అధ్యాపకులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి డా.రవి కుమార్, అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్, పీఆర్‌ఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## వెల్లాల దేవస్థానమునకు

# రూ. 5లక్షల 88వేలు ఆదాయం

**రాజుపాలెం, జూన్ 18, ప్రభాతవార్త.**

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గల శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సంజీవరాయ స్వామి,శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానలకు సంబంధించిన భూముల కౌలు వేలంపాట ద్వారా దేవస్థానమునకు రూ. 5లక్షల 88వేల 200లు ఆదాయం లభించినది. గురువారం స్వామివారి భూములను మూడు సంవత్సరముల కౌలుకు గాను వేలంపాట ఆలయ చైర్మన్ జి.ఎల్ నారాయణ రెడ్డి అధ్యక్షతన డివిజనల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఈవో కేవీ రమణల ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ వేలంపాటలో రైతులు పాటను దక్కించుకున్న వారు కౌలు మొత్తం చెల్లించి భూములను కౌలుకు స్వాధీనం చేసుకోవడం అయినది. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి రామ్మోహన్, ఆలయ పండితులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు సైకిళ్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయ బృందం

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త**

రవాణా సౌకర్యాలు లేక బడికి రావడమే ఒక ప్రహసనంగా మారిన పేద విద్యార్థుల కష్టాలను ప్రొద్దుటూరు మండలం ఖాదరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాశ్వతంగా తీర్చారు. చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చే ఆరవ తరగతి బాలబాలికలు బస్సులు, ఆటోలు దొరక్క అల్లాడిపోతుండటాన్ని చూసి అక్కడి గురువుల హృదయం ద్రవించింది. ప్రభుత్వ సాయం కోసం వేచి చూడకుండా, తమ వంతు బాధ్యతగా ఉపాధ్యాయ బృందమే జేబుల నుంచి నిధులు తీసి విద్యార్థుల చదువుకు చక్రాలు అమర్చింది. ఇందులో భాగంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కళావతి అత్యధికంగా 50 వేల రూపాయలు, ప్రధానోపాధ్యా యులు వై. ప్రసాద్ రెడ్డి 40 వేల రూపాయలు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఎ. జ్యోతిర్మయి 20 వేల రూపాయలు, హిందీ ఉపాధ్యాయురాలు లావణ్య 10 వేల రూపాయల చొప్పున మొత్తం 1,20,000 రూపాయలను తక్షణమే పోగు చేశారు. ఈ సొమ్ముతో కొనుగోలు చేసిన 20 సరికొత్త సైకిళ్లను గురువారం పాఠశాల స్థల దాత వెంకటేశు సమక్షంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లలకు చేతుల మీదుగా అందజేశారు. కొత్త సైకిళ్లు అందుకున్న విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యా బుద్ధులు నేర్పడమే కాకుండా, తాము బడికి వచ్చేందుకు సొంత డబ్బులతో దారి చూపిన ఉపాధ్యాయుల ఉదార గుణానికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



సైకిళ్లు పొందిన విద్యార్థులు

## డ్రైనేజీ కాలువపై కట్టడాలు కడితే

# నోటీసులు జారీచేస్తాం

**ఎంపీడీవో ఫణి రాజకుమారి**



**సిద్దవటం, జూన్ 18 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ఎంపీపీ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో గ్రామీణ ప్రాంతాలలో అపరిశుభ్రత లేకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు ఈ సందర్భంగా ఆమె తమ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ మండల కేంద్రమైన సిద్దవటంలోని ఆకుల వీధిలో అపరిశుభ్రతంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ కార్మికుల చేత తొలగించామని గ్రామాలు పరిశుభ్రంగా పెట్టుకునే బాధ్యత ప్రజలపై ఉందని బ్రాహ్మణ వీధిలో మురుగునీరు వెళ్లే కాలువపై కొంతమంది గృహ నివాసులు బండల కట్టడాలు కట్టారని డ్రైనేజీ నీరు వెళ్లకుండా చేశారని అలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల ప్రజలు గ్రామాలు శుభ్రంగా పెట్టుకోవాలని ప్రతిరోజు గ్రామానికి వచ్చే హరిత రాయబారులకు చెత్త అందించి గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవం

**మైదుకూరు, జూన్ 18, ప్రభాతవార్త:**

మండలంలోని వనిపెంట బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్రీధర్, మరియు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరై కళాశాలను ప్రారంభించారు. కళాశాల ప్రారంభోత్సవ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేస్తున్న కృషిని అభినందించారు. కళాశాలకు అవసరమైన అన్ని వసతులను కల్పించి, విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటి ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ వనిపెంట బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించేందుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్రీధర్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంత బాలికలకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ జూనియర్ కళాశాల ద్వారా విద్యార్థినులు ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.





## పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణ



**ఒంటిమిట్ట జూన్. 18. ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ ఆదివారం వైద్యాధికారులు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై సలహాలు సూచనలు ఇచ్చు నిమిత్తం మండల కేంద్రమైన ఒంటిమిట్ట ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది క్రింది స్థాయి అధికారులకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిని భావన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఆదివారం రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు కార్యక్రమం పై అవగాహన ఇవ్వడం జరిగింది. ఒంటిమిట్ట కేంద్రం ప్రధాన కూడళ్లలో అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ సబ్ సెంటర్లలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏదేమైనప్పటికీ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి అరుణ జ్యోతి, ఎంఈఓ వీరశేఖర్, పబ్లిక్ హెల్త్ నర్స్ వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్లు సుజాత, ఆరోగ్య కార్యకర్త వెంకటసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ సుగుణ, ఆశా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## టెట్‌కు మినహాయింపు కల్పించాలి ఆపస్..



**కడప కార్పొరేషన్ జూన్ 18 ప్రభాతవార్త:**

ఆర్టిఐ చట్ట సవరణ ద్వారా 2010 టెట్ నోటిఫికేషన్‌కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నుండి మినహాయింపు కల్పించవలసిందిగా ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా మీడియా ఇంచార్జి బాలకృష్ణుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కడప కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునకు వినపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల గౌరవ భారత సర్వోన్నత న్యాయస్థానం 2010 టెట్ నోటిఫికేషన్‌కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు కూడా ప్రస్తుతము తప్పనిసరిగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత పొందాలని, లేనిపక్షంలో ఉపాధ్యాయులు ఉద్యోగం నుండి తొలగింపబడవలసి ఉంటుందని తీర్పునిచ్చిందనీ గుర్తు చేశారు. ఈ తీర్పు నేపథ్యంతో 2010 టెట్ నోటిఫికేషన్‌కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, పదోన్నతిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పార్లమెంట్‌లో చట్టసవరణ ద్వారా ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నియమము 2010 టెట్ నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుండి అమలు చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కడప, వల్లూరు మండల బాధ్యులు గంగన్న, రెడ్డయ్య పాల్గొన్నారు.

## గౌతమ్ జూనియర్ కళాశాల ఘన విజయం



**బద్వేలు, జూన్ 18, ప్రభాతవార్త**

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో బద్వేలు పట్టణంలోని గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ సత్తాను చాటారు. ఎంపీసీ గ్రూపులో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించడం ద్వారా కళాశాల జయకేతనం ఎగురవేసింది. ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను ఎస్. అంజనా సౌమ్య 467 మార్కులు సాధించి రాష్ట్ర ద్వితీయ స్థానం దక్కించుకోగా, డి. అలేఖ్య, జి. కౌశిక, కే. పూజిత తలా 465 మార్కులు, ఏ. పూజిత, వి. వెంకటనారాయణ తలా 464 మార్కులు, ఏ. సాత్విక్ కుమార్, ఎం. ప్రణీత తలా 463 మార్కులు, పి. వెంకటరూప 462 మార్కులు, టీ. సౌమ్య 461 మార్కులు, ఎస్.కే. సాదియా 460 మార్కులు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారు. బైపీసీ గ్రూపులో 455 మార్కులకు గాను వి. వర్షిని 444 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచారు. అలాగే కే. శైలు 441 మార్కులు, బి. లికిత 408 మార్కులు, డి. చందు 402 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎం. బాలాజీ, పి. రిజ్వానా, ఎం. ప్రవళిక తలా 989 మార్కులు సాధించగా, ఆర్. చక్రధర్ 988 మార్కులు, ఎస్. హర్షియా, బి. వరుణ్ తలా 987 మార్కులు, ఎస్ఎండి. రాషద్ 986 మార్కులు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత పెంచారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పంగా సౌజన్య లక్ష్మి అభినందించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పుట్‌పాత్ ఆక్రమణలకు చెక్..



**పులివెందుల, జూన్ 18 , ప్రభాతవార్త :**

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించి ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించే దిశగా పులివెందుల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. పులివెందుల పట్టణంలోని బోలె వార్డులో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను మున్సిపల్ అధికారులు తొలగించారు.జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళి సూచనలతో గురువారం మున్సిపల్ కమిషనర్ సి. మునికుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు తమ సిబ్బందితో కలిసి ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనల్లో భాగంగా పాదచారులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా షాపులు ఏర్పాటు చేయడం సరికాదని, సంబంధిత షాపు యజమా నులకు అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.పుట్‌పాత్‌లు పాదచారుల కోసమేనని, వాటిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే భవిష్యత్తు లో కఠిన చర్యలు తీసుకుం టామని అధికారులు హెచ్చ రించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## జూనియర్ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో కీర్తి

**వేంపల్లె జూన్ 18 ప్రభాతవార్త**



ఈ రోజు విడుదల అయినా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్. నూర్జహాన్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. బి.ఐ.పి.సి విభాగానికి చెందిన ఆమె మొత్తం 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి అసాధారణ ప్రతిభను చాటుకుంది.ఈ విజయంతో కళాశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని నూర్జహాన్ మరోసారి నిరూపించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రవి మాట్లాడుతూ, విద్యార్థిని పట్టుదల, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమన్నారు. నాణ్యమైన విద్యతో మరింత మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపారు. విద్యార్థిని నూర్జహాన్‌ను అధ్యాపకులు భాస్కర్ నాయక్, షరీఫ్, ఫైరోజ్ ఖాన్, బాషా, బాబా ఫకృద్దీన్, ఖలీలుల్లాహ్, ఇర్ఫాన్, షఫీఉల్లాహ్, నూర్,లు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఈపంట, ఎరువుల నిర్వహణపై శిక్షణ



**ముద్దనూరు, జూన్ 18 ప్రభాతవార్త:**

ఖరీఫ్ 2026, 27 సీజన్‌కు సంబంధించిన ఈపంట నమోదు, ఎరువుల నిర్వహణ విధానాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి గురువారం ముద్దనూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ఏడిఏ రామమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె. ఏడిఏ మాట్లాడుతూ పంట అవసరాలకు అనుగుణంగా శాస్త్రవేత్తల సిఫారసుల మేరకు ఎరువులు అందించబడతాయని, దీంతో ఎరువుల దుర్వినియోగం తగ్గి భూసారం పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి, ఎ.వి. రామాంజులు రెడ్డి, రాజు, ఎస్. మధుసూదన్ రెడ్డి, ఐ. రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవిద్యా అద్భుత ఫలితాలు



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 18 ప్రభాతవార్త**

స్థానిక సూపర్ బజార్‌లో ఉన్న శ్రీవిద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం విడుదల చేసిన జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో యం.పి.సి మరియు బై.పి.సి గ్రూపులలో అగ్రస్థానంలో నిలిచారు. ఇంతటి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎస్.శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.ఓ.వి. రమణారావు, డైరెక్టర్ ఎమ్. రామమోహన్, అధ్యాపకులు అభినందించారు. జూనియర్ ఇంటర్ యం.పి.సి గ్రూప్ లో రిషిక సాయి, జి. ఆర్. ఎస్. నయని, ముస్తాక్ హుస్సేన్, బాల శివ కుమార్, కృష్ణ కార్తీక్ 466, సాయిగ్రీష్మా రెడ్డి, ప్రణతి, అస్రాఫ్, సుగమనశ్రీ, భవ్య శ్రీ, నరసింహ 465 మార్కులు, బై.పి.సి గ్రూపులో మహాలక్ష్మి, సఫియా, అఫ్రోచ్ 450, సుజిత శ్రీ, శర్వాణీ 447, తనూజ 446 మార్కులు, సీనియర్ ఎంపిసిలో తిరుమల గణేష్ 994, కృష్ణ తేజ్ 992, రంగ హర్ష వర్ధన్, సుమాయా సుల్తానా, పుష్పలత 990, సీనియర్ బైపిసిలో పవన్ కుమార్ 990, వెంకట సోమేశ్వరీ 987 మార్కులతో సత్తా చాటారని వివరించారు.

## ఏస్.ఐ.ఆర్. ప్రక్రియను పరిశీలించిన జనసేన

**వేంపల్లి, జూన్ 18 ప్రభాతవార్త**

స్థానిక పట్టణంలోని గాంధీ రోడ్డు 12వ వార్డు సమీపంలో బి.ఎల్.ఓ అమల నేతృత్వంలో జరిగే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డా. హరీష్ పరిశీలించారు. తదనంతరం మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఎక్కడ లోటుపాట్లు జరగకుండా చూడవలసిన బాధ్యత బి.ఎల్.ఓ. లదే అని మాట్లాడారు. ఒకే వ్యక్తికి చెందిన రెండు ఓట్ల ఐడి కార్డ్స్ ఉంటే వెంటనే ఒక ఓటర్ ఐడి ని తొలగించాలని చెప్పారు. ఎవరైనా మరణించి ఉంటే ఆ వ్యక్తిని ఓటర్ లిస్ట్ నుంచి తీసివేయాలని మాట్లాడారు. అలాగే 18 ఏళ్ల నుండి ఓటు హక్కు లేని వారికి కొత్తగా ఓటు హక్కు కల్పించాలని కోరారు. అదేవిధంగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గోసుల ఆంజనేయులు, పెడబలి సుధీర్ రెడ్డి సొక్కం మల్లికార్జున, మల్లేష్, అంజి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.





## స్వచ్ఛ రథంను ప్రజలు వినియోగించుకోవాలి

**దువ్వూరు, జూన్ 18, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ రథాన్ని గ్రామాలలో ఉన్న చెత్తా, చెదారాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసిందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని జమ్మలమడుగు డివిజనల్ అభివృద్ధి అధికారి రామాంజినేయులు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన దువ్వూరులో స్వచ్ఛ రథంను పరిశీలించి వారికి వివిధ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి స్వచ్ఛ రథం వస్తుందని తమ ఇళ్లల్లో ఉన్న చెత్తా చెదారం, ప్లాస్టిక్ వస్తువులు అన్నింటినీ ఇస్తే వాటికి బదులుగా డబ్బులు కానీ, నిత్యావసర వస్తువులు గాని ఇస్తారని తెలిపారు. దీనిని వినియోగించాలని అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి పనిని పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధంపై దృష్టి పెట్టాలని అలాగే మంచినీటి సమస్యను కూడా తీర్చాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

**వాల్మీకిపురం, జూన్ 18 ప్రభాతవార్త:**

పట్టణంలోని సీడీసీఏ జీవీఎస్సీ ఎస్ క్రీడామైదానంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్16 బాలుర మల్టీడే క్రికెట్ అంతర్ జిల్లాల పోటీలు రెండురోజు హోరా హోరిగా సాగాయి గురువారం గ్రౌండ్1 క్రీడా మైదానంలో కడప, నెల్లూరు క్రికెట్ టీంలు తలపడ్డాయి తొలి ఇన్నింగ్స్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు 97 ఓవర్లలో 364 పరుగులు చేసి ఆటౌల్ అయ్యింది. ఇందులో బ్యాట్స్మెన్ సాయిక్రిష్ణ చైతన్య137 బంతుల్లో 102 పరుగులు చేసి అజేయ సెంచిరీ నమోదు చేశాడు. అలాగే లోకేష్ 107 బంతుల్లో 67 పరుగులు, శివచరణ్ 127 బంతుల్లో 68 పరుగులు చేశాడు. నెల్లూరు క్రికెట్ జట్టుకు చెందిన బౌలర్లు సుశాంత్ 76 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అలాగే గ్రౌండ్2లో గురువారం జరిగిన తొలి ఇన్నింగ్స్లో చిత్తూరు, కర్నూలు జిల్లా క్రికెట్ జట్లు తలపడ్డాయి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు క్రికెట్ జట్టు 821 ఓవర్లలో 342 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇందులో రిత్విక్ 162 బంతుల్లో 159 పరుగులు చేసి సెంచరీ నమోదు చేశాడు. బ్యాట్స్మెన్ సాయి శ్రీవాస్తవ 92 బంతుల్లో 59 పరుగులు చేశాడు. చిత్తూరు క్రికెట్ జట్టుకు చెందిన బౌలర్లు బౌలర్ రక్షణసాయి 66 పరుగులు ఇచ్చి ఆరువికెట్లు తీశాడు. తదుపరి బ్యాటింగ్ కి దిగిన చిత్తూరు జట్టు 5 ఓవర్లు ఆడి వికెట్ కోల్పోయి 33 పరుగులు చేసి ఆటను కొనసాగిస్తుంది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా చీఫ్ కోచ్ సునీల్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాల క్రికెట్ కోచ్లు ప్రసన్న కుమార్, షోయబ్లు, కడప కోచ్లు, సౌతాన్ సెలెక్టర్లు జవహర్ బాషా, హరీష్, రెడ్డిగిరీష్లు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.